సాక్షి
జగిత్యాల
గురువారం । 16 । అక్టోబర్ । 2025



కుంగుబాటు.. లొంగుబాటు!

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండున్నర దశాబ్దాల కిందట సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు, జనశక్తి నక్సలైట్ల ఉద్యమాలు బలంగా ఉండేవి.

10లో▸



'క్రిప్టో' దందాపై నిఘా

జిల్లాలో రెండేళ్లుగా మెటాఫండ్ ప్రో. పలు కంపెనీల పేరుతో ఆన్‌లైన్‌లో మోసం చేసిన యాప్ నిర్వాహకులపై పోలీసు శాఖ చర్యలు చేపట్టింది.

10లో▸

గరిష్ఠం/కనిష్ఠం
33.0/24.0

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది.

న్యూస్‌రీల్

కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయాలి



కాన్ఫరెన్స్‌లో కలెక్టర్

జగిత్యాల: ధాన్యం కొనుగోలు కేంద్రాలను సిద్ధం చేయాలని, కేంద్రాల్లో వసతులు కల్పించాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర్‌రావు కలెక్టర్‌ను ఆదేశించారు. గన్నీసంచులు, కాంటాలు, ప్యాడీక్లీనర్లు అందుబాటులో ఉంచుకోవాలని, ఎవరికీ ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. దొడ్డు, సన్నరకం ధాన్యాన్ని వేర్వేరుగా కొనాలన్నారు. కలెక్టర్ సత్యప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాలో 421 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని, దాదాపు 7.50 నుంచి 8 లక్షల టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని వివరించారు.

డ్రైనేజీల్లో వ్యర్థాల తొలగింపు



శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

మెట్‌పల్లి: పట్టణంలోని 12వార్డు శివారు డ్రైనేజీల్లో పేరుకపోయిన వ్యర్థాలను తొలగించారు. చెత్తాచెదారాన్ని కొన్ని నెలలుగా తొలగించకపోవడంతో బుధవారం 'సాక్షి'లో 'ఇదేనా చి(చె)త్తశుది' శీర్షికన కథనం ప్రచురించింది. స్పందించిన మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య సిబ్బందితో తొలగించి శుభ్రం చేయించారు. ఇళ్లలో వెలువడే చెత్తను ప్రజలు మున్సిపల్ ఆటోలకు ఇవ్వకుండా డ్రైనేజీల్లో వేయడంతో ఈ పరిస్థితి తలెత్తుతోందని అధికారులు తెలిపారు.

మల్యాల పోలీస్‌స్టేషన్ పరిశీలించిన ఎస్పీ



మల్యాల పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ అశోక్ కుమార్

మల్యాల: మల్యాల పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ అశోక్‌కుమార్ బుధవారం తనిఖీ చేశారు. రికార్డులు, కేసు డైరీ, రిజిస్టర్లను పరిశీలించారు. సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. పెండింగ్ కేసులు ఉండొద్దని, బాధితులతో మర్యాదగా ప్రవర్తించాలని సూచించారు. స్టేషన్ పరిసర ప్రాంతాల్లో 5ఎస్ విధానాన్ని అమలు చేస్తూ, పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆయన వెంట డీఎస్పీ రఘుచందర్, సీఐ నీలం రవి, ఎస్సై నరేశ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రధాన దారి.. ప్రమాదాల నిలయం



గుంతలమయంగా మారిన బుగ్గారం రహదారి

బుగ్గారం: బుగ్గారం మండలానికి వెళ్లే ప్రధాన రహదారి పూర్తిగా గుంతలమయంగా మారింది. ఈ దారిని డబుల్ రోడ్డుగా మార్చడానికి గతంలో చేసిన ప్రతిపాదనలు కాగితాలకే పరిమితమయ్యాయి. మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం వచ్చే వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొన్నిసార్లు ప్రమాదాలు కూడా చోటుచేసుకున్నాయి. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి డబుల్ రోడ్డుగా విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు.

పెద్దాస్పత్రిలో గర్భిణుల అవస్థలు

- స్కానింగ్ కోసం ఎదురుచూపులు
- ఆస్పత్రిలో జెల్ కొరత
- రేడియాలజిస్ట్ ఒక్కరే



స్కానింగ్ కోసం వచ్చిన గర్భిణులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని మాతాశిశు సంక్షేమ కేంద్రానికి వందలాదిగా గర్భిణులు తరలివస్తుంటారు. నెలలో సుమారు 300 నుంచి 400ప్రసవాలు ఇక్కడ జరుగుతాయి. జిల్లాకేంద్రం కావడంతో మెరుగైన వైద్యం అందుతుందన్న ఉద్దేశంతో చుట్టుపక్కల గ్రామాలు, పొరుగు జిల్లాల నుంచి కూడా ఇక్కడకే వస్తుంటారు. కొద్దిరోజులుగా స్కానింగ్ కోసం వస్తున్న గర్భిణులు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ పనిచేస్తున్న ఓ రేడియాలజిస్ట్‌ను బదిలీ చేయడం.. ఒక్కరే రేడియాలజిస్ట్ ఉండడంతో స్కానింగ్ కోసం గర్భిణులు గంటల తరబడి ఎదురుచూడాల్సిన దుస్థితి ఏర్పడింది. ప్రతిరోజూ వందమందికి తగ్గకుండా గర్భిణులు వస్తుంటారు. వారంతా స్కానింగ్ కోసం నిరీక్షించాల్సి వస్తోంది. వాస్తవానికి గర్భిణులకు విశ్రాంతి చాలా అవసరం. బస్సులు, ఆటోలో, ఇతరత్రా వాహనాల్లో వచ్చిన వారు స్కానింగ్ కోసం ఆస్పత్రిలో గంటలకొద్ది వేచి చూడాల్సి రావడం ఆందోళన కలిగిస్తోంది. ఉదయం వస్తే సాయంత్రం వరకూ ఆస్పత్రిలోనే ఉండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో రేడియాలజిస్ట్‌ను నియమిస్తే సమస్య కొంత తీరే అవకాశం కనిపిస్తోంది. స్టాఫ్‌ను కూడా సరిపడా నియమించాలని అంటున్నారు.

ఆస్పత్రిలో జెల్ కరువు

స్కానింగ్‌కు ఉపయోగించే జెల్ కూడా ఆస్పత్రిలో లేదని సమాచారం. ఫలితంగా నాలుగు రోజులుగా స్కానింగ్‌లు నిలిపివేశారు. స్కానింగ్ చేసేటప్పుడు ఎక్కువగా జెల్ ఉపయోగించాల్సి ఉంటుంది. దీంతో గర్భిణులు ఆవేదనకు గురవుతున్నారు. గర్భిణులపై అక్కడ పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డులు కూడా దురుసుగా ప్రవర్తిస్తున్నట్లు ఆరోపణలొస్తున్నాయి. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని రేడియాలజిస్ట్‌ను నియమించాలని, జెల్ తెప్పించి స్కానింగ్‌లు చేయించేలా చర్యలు చేపట్టాలని గర్భిణులు కోరుతున్నారు.

రేడియాలజిస్ట్ ఒక్కరే..

ఆస్పత్రిలో రేడియాలజిస్ట్ ఒక్కరే ఉండటంతో స్కానింగ్‌కు ఇబ్బందిగా మారింది. ఒక గర్భిణీకి స్కాన్ చేయాలంటే గంట నుంచి రెండు గంటల సమయం పడుతుంది. వంద మందికి పైగా వస్తే ఒకరోజు సరిపోదు. కొంతమంది అక్కడ ఉండలేక వెనుదిరగాల్సి వస్తోంది. జిల్లాకేంద్రానికి చెందిన వారు ఉదయం వచ్చి సాయంత్రం వరకు ఉంటున్నారు.

జెల్ లేదంటున్నారు



శుక్రవారం నుంచి ఆస్పత్రికి స్కానింగ్ కోసం వస్తున్నాం. వచ్చిన ప్రతిసారీ జెల్ లేదని చెబుతున్నారు. స్కానింగ్ చేయడం లేదు. గంటలకొద్ది కూర్చుండబెడుతున్నారు. దూర ప్రాంతం నుంచి వచ్చాం. పట్టించుకునే వారు లేరు. అధికారులు చర్యలు తీసుకోవాలి.

– గర్భిణి బంధువు

ఇబ్బంది లేకుండా చూస్తున్నాం



జెల్ తెప్పించాం. సిబ్బంది తక్కువగా ఉండటంతో కొంత ఇబ్బందిగా ఉంది. రేడియాలజిస్ట్‌ను త్వరలో నియమిస్తాం. గర్భిణుల కోసం మెరుగైన వసతులు కల్పిస్తున్నాం. రెండుమూడు రోజులుగా సిబ్బంది లేకపోవడం.. జెల్ సరిపడా లేక ఇబ్బంది అయింది.

– రాధాకృష్ణమూర్తి, సూపరింటెండెంట్

పనులు చేస్తారా.. తప్పకుంటారా..



అర్ధాంతరంగా ఆగిన కోరుట్ల-సంగెం రోడ్డు పనులు (ఫైల్)

- కాంట్రాక్టర్లకు ఆర్‌అండ్‌బీ, పీఆర్ శాఖల ఉత్తర్వులు
- పాత పనుల్లో టెండర్ల పరేషాన్
- బిల్లు రానిదే చేయలేమంటున్న కాంట్రాక్టర్లు

కోరుట్ల: జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో ఆర్‌అండ్‌బీ, పీఆర్ విభాగాలకు చెందిన పనులు చేసేందుకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్లు ఆ పనులు సత్వరమే ప్రారంభించాలని, లేకుంటే రద్దు చేసుకోవాలని గత నెల 15, 19వ తేదీల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా పనులకు టెండర్లు వేసిన కాంట్రాక్టర్లు పూర్తిస్థాయిలో బిల్లులు రాకపోవడంతో మిగిలిన పనులు మొదలుపెట్టేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఇదివరకు చేసిన పనులకు బిల్లులు మంజూరైతే మిగిలిన పనులు చేద్దామన్న ఆలోచనలో కాంట్రాక్టర్లు ఉన్నారు. తాజాగా సదరు పనులను రద్దు చేసుకోవాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో మల్లగుల్లాలు పడుతున్నారు.

పాత బిల్లుల పరేషాన్..

జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజకవర్గ పరిధిలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం పూర్తి చేసిన పనుల బిల్లులు చాలామేర ఇప్పటికీ కాంట్రాక్టర్ల చేతికి అందలేదు. ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్, ఇరిగేషన్, సోషల్ వెల్ఫేర్‌లో పూర్తయిన పనులకు సంబంధించి సుమారు రూ.60 కోట్ల మేర బిల్లులు కాంట్రాక్టర్లకు రావాల్సి ఉంది. రెండేళ్లు గడుస్తున్నా ఆ బిల్లులు ఇప్పటికీ మంజూరు కాలేదు. పాత బిల్లుల కోసం ఇటు అధికార యంత్రాంగం..అటు అధికార పార్టీ నాయకుల చుట్టూ కాంట్రాక్టర్లు తిరుగుతున్నా ఫలితం దక్కడం లేదు. ఈ బిల్లుల రాకపోవడంతో కొంతమంది కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించారు. గత ప్రభుత్వ హయాంలో టెండర్ వేసి పనులు మొదలుపెట్టని వాటిని ఈఈ, డీఈ స్థాయి అధికారులు పరిశీలించి వాటిని రద్దు చేసుకోవాలని కాంట్రాక్టర్లతో లేఖలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం.

రద్దు వైపు మొగ్గు..?

రెండేళ్లుగా బిల్లులు రాకపోవడంతో పాత ప్రభుత్వ హయాంలో టెండర్లు దక్కించుకుని పనులు మొదలు పెట్టని కాంట్రాక్టర్లు ఆ పనులను రద్దు చేయడానికి మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. సెప్టెంబర్‌లో జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం కాంట్రాక్టు తీసుకుని గ్రౌండింగ్ పనులు కాకపోవడం.. అసలే పనులు మొదలు కాకుండా ఉన్న పనులను గుర్తించడానికి అధికారులు సన్నాహాలు చేపట్టారు. ఆ పనులకు ఈఎండీ డబ్బులను వాపస్ చేయాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ ఆదేశాల వచ్చిన క్రమంలో కాంట్రాక్టర్ల పనుల రద్దు లేఖలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం. ధర్మపురిలో మినహా మిగిలిన చోట్ల కాంట్రాక్టర్లు పాత టెండర్ల నుంచి తప్పుకోవడం వైపే మొగ్గు చూపుతుండడం గమనార్హం. ఒకవేళ కాంట్రాక్టర్లు తప్పుకుంటే తిరిగి నిధులు రావడం.. టెండర్లు వేయడం వంటి ప్రక్రియ పూర్తికావడానికి తీవ్ర జాప్యం జరుగుతుంది. అదే జరిగితే సీసీ రోడ్లు, వంతెనలు, కాజ్‌వేల పనులు పూర్తి కాక జనం నానా తిప్పలు పడే అవకాశాలు ఉన్నాయి.

బాల నేరస్తుల కేసులకు సత్వర పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.రత్న పద్మావతి



జువైనల్ జస్టిస్ బోర్డు ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి రత్న పద్మావతి

జగిత్యాలజోన్: జువైనల్ జస్టిస్ బోర్డు ఏర్పాటుతో బాల నేరస్తుల కేసులకు సత్వర పరిష్కారం లభిస్తుందని జిల్లా జడ్జి సి.రత్నపద్మావతి అన్నారు. జిల్లాకేంద్రంలోని బైపాస్ రోడ్డులో జువైనల్ జస్టిస్ బోర్డును బుధవారం ప్రారంభించారు. బాల నేరస్థుల కేసుల్లో జరిమానా, శిక్ష విధించడం కాకుండా.. మంచి ప్రవర్తనతో సమాజంలోకి వెళ్లేలా చూస్తామని, సమాజంలో మంచి పరిణామాలపై కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. శిశు సంక్షేమ శాఖ ద్వారా వారికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. బోర్డు చైర్‌పర్సన్, జిల్లా మొదటి అదనపు జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ శ్రీనిజ కోహిర్కర్ బెంచ్ నిర్వహించారు. బాల నేరస్తుల కేసుల్లో బెయిల్‌పై న్యాయవాదులు తమ వాదనలు వినిపించారు. మొదటి అదనపు జిల్లా జడ్జి సుగళి నారాయణ, సబ్ జడ్జి వెంకటమల్లిక్ సుబ్రహ్మణ్య శర్మ, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి లావణ్య, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ గంప కరుణాకర్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాచకొండ శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి అందె మారుతి, కోర్టు సూపరింటెండెంట్ షఫీయోద్దిన్, ఎంప్లాయీస్ అధ్యక్షుడు రామడుగు శ్రీనివాస్, మహిళా, శిశు సంక్షేమాధికారి నరేశ్ పాల్గొన్నారు.

ఇసుక తక్కువ ధరకు ఇచ్చేలా చూడండి

జగిత్యాల: జిల్లాకేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఏర్పాటు చేసిన సాండ్ బజార్‌లో ఇసుకను తక్కువ ధరకు ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని మినరల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అనిల్‌కుమార్‌కు మాజీమంత్రి జీవన్‌రెడ్డి వినతిపత్రం అందించారు. వినియోగదారులకు రూ.6500కు ట్రిప్ ఇసుక ఇస్తుండడం భారంగా మారిందన్నారు. అక్రమ రవాణా ద్వారా వచ్చే ఇసుక సాండ్ బజార్ ఇసుక కన్నా తక్కువని, దీంతో నెలలో రూ.8 లక్షలు మాత్రమే రెవెన్యూ వచ్చిందని తెలిపారు. చైర్మన్ చొరవ చూపి రేట్లు తగ్గించాలని కోరారు.

పెన్షనర్ల బకాయిలు వచ్చేవరకు ఉద్యమం



కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న నాయకులు

జగిత్యాల: ఉద్యోగ విరమణ పొందిన వారికి ప్రయోజనాలు వచ్చేవరకూ ఉద్యమం కొనసాగిస్తామని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు చంద్రమౌళి అన్నారు. కలెక్టరేట్ ఎదుట బుధవారం ఆందోళన చేపట్టారు. ఉద్యోగ విరమణ పొందిన వారికి జీపీఎఫ్, జీఐఎస్, లీవ్స్, కమ్యుటేషన్, గ్రాట్యుటీ అందలేదన్నారు. ఉమ్మడి జిల్లా కార్యదర్శి రాంరెడ్డి, నరేందర్‌రావు, వెంకటరమణ, అహ్మద్, ప్రభు, కరుణశ్రీ, రాందాస్, వేణుగోపాల్, విమల, చంద్రమౌళి పాల్గొన్నారు.

ల్యాండ్ అండ్ రికార్డ్స్ అధికారిగా అశోక్

జగిత్యాల: ల్యాండ్ అండ్ రికార్డ్స్ అధికారిగా అశోక్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న వెంకట్‌రెడ్డి హైదరాబాద్ అర్బన్ ఏడీగా వెళ్లారు. ఆయన స్థానంలో నిజామాబాద్‌లో ఏడీగా పనిచేస్తున్న అశోక్‌ను ఇన్‌చార్జిగా నియమించారు.

పేరుకే ప్రజాపాలన

- ఇందిరమ్మ రాజ్యంలో కార్మికులకు ఒరిగిందేమీ లేదు
- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్



మాట్లాడుతున్న పుప్పాల శ్రీకాంత్

గొల్లపల్లి: కాంగ్రెస్ ప్రజాపాలనలో కార్మికులకు ఒరిగిందేమీ లేదని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ అన్నారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా నాలుగో మహాసభను మండలకేంద్రంలోని రెడ్డి సంఘం ఫంక్షన్ హాల్‌లో యూనియన్ జిల్లా అధ్యక్షులు కోమటి చంద్రశేఖర్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు నిత్యం పారిశుద్ధ్యం, మంచినీటి సరఫరా, వీధి లైట్లు, డంపింగ్ యార్డ్స్, హరితహారం, వైకుంఠధామాలు, పల్లె ప్రకృతి వనాల నిర్వహణలో పనిచేస్తున్నారని, అలాంటి కార్మికుల సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందన్నారు. మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేయాలన్నారు. అనంతరం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా పులి మల్లేశం, అధ్యక్షుడుగా కొమటి చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శిగా జంగిలి ఎల్లయ్య, కోశాధికారిగా నేర్ల మోహన్, ఉపాధ్యక్షులుగా న్వాతరి మల్లవ్వ, గుడిసె దేవయ్య, శాతల్ల రాజేందర్ ఎన్నికయ్యారు. మహాసభలో రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ, జిల్లా కమిటీ సభ్యులు వెల్మల పల్లి వెంకట చారి, నాయకులు కనికరపు సత్తయ్య, సిరివెల్లి సాయి, జోగవ్వ, లక్ష్మీ నారాయణ, తిరుపతి పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు 286 దరఖాస్తులు



జగిత్యాలక్రైం: జిల్లాలోని 71 మద్యం దుకాణాలకు ఇప్పటివరకు 286 దరఖాస్తులు వచ్చినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ బుధవారం తెలిపారు.

విద్యకు ప్రాధాన్యం



అర్బన్ హౌసింగ్ కాలనీలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: విద్యకు ప్రాధాన్యం ఇస్తున్నామని, ఇందులోభాగంగానే జిల్లా కేంద్రంలోని పురాణిపేట ఉన్నత పాఠశాలకు రూ.13.50 లక్షలతో సైన్స్ ల్యాబ్ నిర్మించామని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్య అందుతోందన్నారు. డీఈవో రాము మాట్లాడుతూ పాఠశాలల్లో సైన్స్‌ల్యాబ్‌లు ఏర్పాటయ్యాయని, వీటి ద్వారా విద్యార్థుల్లో నైపుణ్యం పెరుగుతుందన్నారు. సైన్స్ అధికారి మచ్చ రాజశేఖర్, మున్సిపల్ మాజీ చైర్మన్ నాగభూషణం, ఏఈ ధనుంజయ్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆనందరావు, అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

డంపింగ్ యార్డుకు ఫెన్సింగ్

డంపింగ్‌యార్డుకు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని మున్సిపల్ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. బుధవారం అర్బన్ హౌసింగ్ కాలనీ అభివృద్ధి పనులు పరిశీలించారు. కాలనీలో చేపడుతున్న సీసీరోడ్లు, డ్రైన్లను పరిశీలించారు. కమిషనర్ స్పందన, డీఈ మిలింద్, ఏఈ అనిల్ పాల్గొన్నారు. ముందుగా రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గ ప్రమాణ స్వీకారంలో పాల్గొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

పోషకాహారంతోనే ఆరోగ్యం

జగిత్యాలరూరల్: పోషకాహారంతోనే తల్లిబిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే అన్నారు. అంతర్గాంలో పోషణ మాసం కార్యక్రమంలో పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలు ఆహారంలో కూరగాయలు, ఆకుకూరలు ఉండేలా చూసుకోవాలన్నారు. సంక్షేమాధికారి నరేశ్, తహసీల్దార్ వరందన్, ఎంపీడీవో రమాదేవి, సీడీపీవో మమత, ఎంఈవో గంగాధర్ పాల్గొన్నారు. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లికి చెందిన బెరిగేడి నర్సయ్యకు రూ.2.50 లక్షల విలువైన ఎల్‌వోసీ అందించారు.

ఆర్నెల్లకోసారి గాలికుంటు నివారణ టీకాలు

జగిత్యాలఅగ్రికల్చర్: పశువులకు ప్రతి ఆర్నెళ్లకోసారి ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలను పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ఇస్తున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. అంతర్గాంలో పశువులకు టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా పశు వైద్యాధికారి ప్రకాష్ మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 69 బృందాలు టీకాలు వేస్తున్నాయన్నారు. పశు వైద్య సహాయ సంచాలకులు నరేశ్, పశువైద్యులు నరేశ్ రెడ్డి, వేణుగోపాల్, కిరణ్‌రెడ్డి, బద్దం రాజేందర్ రెడ్డి పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన తప్పనిసరి

- డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్



ప్రయాణికులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో

జగిత్యాల: సీపీఆర్‌పై ప్రతిఒక్కరికీ అవగాహన ఉండాలని డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ అన్నారు. జగిత్యాల బస్టాండ్‌లో ప్రయాణికులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. సీపీఆర్ ఎలా చేయాలి..? కార్డియాక్ అరెస్ట్ అయినప్పుడు ఎలా కాపాడాలని తెలుసుకుంటే ఒకరి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. డిపో మేనేజర్ కల్పన, ఎంఎఫ్ కవిత, శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచాలి

జిల్లాలోని స్కానింగ్ సెంటర్లపై నిఘా పెంచాలని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో అన్నారు. అడ్వైజరీ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ.. స్కానింగ్ సెంటర్ రిజిస్ట్రేషన్ నిబంధనలు పాటించాలని సూచించారు. జిల్లాలో 80 స్కానింగ్ సెంటర్లున్నాయని, లింగ వివక్ష చూపరాదని పేర్కొన్నారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రోగ్రాం ఆఫీసర్ శ్రీనివాస్, అర్చన, స్వచ్ఛంద సంస్థ సభ్యులు తౌటు రాంచంద్రం, హెల్త్ ఎడ్యుకేటర్స్ భూమేశ్వర్, కరుణ పాల్గొన్నారు.

మక్కల కొనుగోలుకు మార్క్‌ఫెడ్ సిద్ధం

- జిల్లాలో 13 కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక
- త్వరలో ప్రారంభించేలా చర్యలు



ఆరబెట్టిన మక్కకంకులు

జగిత్యాలఅగ్రికల్చర్: మొక్కజొన్న పంట ఇప్పుడిప్పుడే మార్కెట్‌కు వస్తోంది. మొన్నటి వరకు క్వింటాల్‌కు రూ.3వేలు పలికిన ధర.. ప్రస్తుతం రూ.1800కు పడిపోయింది. ఈ క్రమంలో మద్దతు ధర రూ.2400 చొప్పున కొనాలని రైతులు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచారు. దీంతో మార్క్‌ఫెడ్ ద్వారా మక్కలు కొనేందుకు సర్కారు నిర్ణయించింది. ఆదేశాలు రాగానే కొనుగోళ్లు ప్రారంభించేందుకు అధికార యంత్రాంగం ప్రణాళిక సిద్ధం చేసింది.

జిల్లాలో 13 కేంద్రాల ఏర్పాటు

మొక్కజొన్న పంట అధికంగా సాగయ్యే ధర్మపురి, గొల్లపల్లి, ఇబ్రహీంపట్నం, జగిత్యాల, కథలాపూర్, కోరుట్ల, మల్లాపూర్, మెట్‌పల్లి, రాయికల్, బీర్‌పూర్, భీమారం, మేడిపల్లి మండల కేంద్రాల్లో 13 కేంద్రాలను ఏర్పాటు చేయన్నారు.

9.61లక్షల క్వింటాళ్ల అంచనా

జిల్లాలో వరి తర్వాత మొక్కజొన్నే అధికంగా సాగు చేస్తారు. సుమారు 32,061ఎకరాల్లో సాగు చేయగా.. ఎకరాకు 30క్వింటాళ్ల చొప్పున 9.61 లక్షల క్వింటాళ్ల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కొనుగోలు చేసిన మక్కలను మల్లాపూర్, ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లిలోని గోదాముల్లో నిల్వ చేయనున్నారు. సుమారు నాలుగు లక్షల గన్నీ సంచులు తెప్పిస్తున్నారు. అందుబాటులో ఉండాలని హమాలీలకు సూచించారు.

కొనుగోలుకు సిద్ధం



జిల్లాలో 13 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. అవసరమైన సామగ్రి మొత్తం సమకూర్చుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే రంగంలోకి దిగుతాం. సర్కారు నుంచి ఒకట్రెండు రోజుల్లోనే ఆదేశాలు వచ్చే అవకాశం కనిపిస్తోంది.

– ఎండీ.హబీబ్, మార్క్‌ఫెడ్ అధికారి

ఆరుగాలం.. దళారుల పరం

- సోయాపంట అమ్మేందుకు తిప్పలు
- కొనేవారు లేక దళారుల పాలు



సోయాబిన్‌ను తూకం వేస్తున్న దళారులు

ఇబ్రహీంపట్నం: ఆరుగాలం శ్రమించి పండించిన సోయాబీన్ పంటను కొనేవారు లేక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఇబ్రహీంపట్నం మండలంలో ఈ వర్షకాలంలో 650 ఎకరాల్లో సోయాబిన్ సాగు చేశారు. వర్షాలు సమృద్ధిగా పడడంతో ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. అయితే ప్రభుత్వం ఇప్పటివరకు కొనుగోలు ప్రక్రియ చేపట్టకపోవడంతో దళారులకు తెగనమ్ముకుంటున్నారు. సోయాబిన్ క్వింటాల్‌కు రూ.5,328 ఉండగా.. దళారులు రూ.4వేలు మాత్రమే చెల్లిస్తూ.. రైతులను నిండా ముంచుతున్నారు. మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు విన్నవిస్తున్నా, ఇటీవల మెట్‌పల్లిలో ధర్నా చేసినా.. అధికారుల్లో చలనం లేదంటున్నారు రైతులు. ఓ వైపు మబ్బులు భయపెడుతున్నాయని, వర్షం కురిస్తే ఆరబెట్టిన సోయా తడిసే అవకాశముందని అంటున్నారు. ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు.

దళారులకు అమ్ముకుంటున్నాం



కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో చేతికందిన సోయాబిన్‌ను విధిలేక దళారులకు అమ్ముకుంటున్నాం. దళారులకు అమ్మడం ద్వారా క్వింటాల్‌కు రూ.వెయ్యి నష్టపోతున్నాం.

– ఏలేటి ప్రతాప్‌రెడ్డి, రైతు, ఇబ్రహీంపట్నం

కేంద్రాలు ప్రారంభించాలి



నేను రెండెకరాల్లో సోయా వేశా. 20 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ప్రభుత్వం కొనకపోవడంతో దళారులు క్వింటాల్‌కు రూ.4వేల చొప్పున పెడుతున్నారు. ప్రభుత్వం స్పందించి కేంద్రాలు ప్రారంభించాలి.

– ఇట్టెడి భీంరెడ్డి, రైతు, ఇబ్రహీంపట్నం

క్లుప్తంగా

స్వగ్రామానికి యువకుడి మృతదేహం


తేజ (ఫైల్)

గంభీరావుపేట(సిరిసిల్ల): మండలంలోని నాగంపేటకు చెందిన బిట్ల తేజ(24) దుబాయిలో అనుమానాస్పదస్థితిలో మృతిచెందాడు. నెల రోజుల తర్వాత మృతదేహం బుధవారం స్వగ్రామానికి చేరింది. జీవనోపాధి కోసం 8 నెలల క్రితం తేజ దుబాయి వెళ్లాడు. నెల రోజుల క్రితం ఇంటికొస్తానని షాపింగ్ చేయడానికి బయటకు వెళ్లి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతికి కారణాలు తెలియలేదు.

విద్యుదాఘాతంతో వ్యాపారి మృతి

పెద్దపల్లిరూరల్: జిల్లా కేంద్రంలోని కూనారం రోడ్డుకు చెందిన వేల్పుల రమేశ్ (55)అనే కిరాణా వ్యాపారి బుధవారం విద్యుత్ షాక్ గురై మరణించాడు. భవనం పైఅంతస్తుకు ఇనుప నిచ్చెన తీసుకెళ్తుండగా.. పక్కనే ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలకు తగిలింది. దీంతో ఆయన షాక్‌కుగురయ్యాడు. స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారని ఎస్సై లక్ష్మణ్‌రావు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

మేకల కాపరి ఆత్మహత్య


శంకరయ్య (ఫైల్)

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): మండలంలోని రాచర్ల తిమ్మాపూర్‌కు చెందిన చాట్ల శంకరయ్య(47) అనే మేకల కాపరి అనారోగ్యం బాధ భరించలేక బుధవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై రాహుల్‌రెడ్డి తెలిపిన వివరాలు. శంకరయ్య మేకలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఐదేళ్ల క్రితం కడుపునొప్పి, షుగర్, బీపీ వ్యాధుల బారిన పడ్డాడు. పలు ఆస్పత్రులు తిరిగి వైద్యం చేయించుకున్నాడు. ఆరోగ్యం కుదుట పడకపోవడంతో వైద్యం కోసం చేసిన అప్పులు మిగిలాయి. భార్య లక్ష్మి మేకలను కాసేందుకు బుధవారం ఉదయం వెళ్లగా.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య లక్ష్మి, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాహుల్‌రెడ్డి వివరించారు.

గోదావరిలో వ్యక్తి మృతదేహం

మల్లాపూర్: మండలంలోని కొత్తదాంరాజుపల్లి శివారు గోదావరిలో బుధవారం ఓ వ్యక్తి మృతదేహం కనిపించింది. స్థానికుల సమాచారంతో ఎస్సై రాజు, సిబ్బంది ఘటనస్థలికి చేరుకుని అన్ని పోలీస్‌స్టేషన్లకు సమాచారమిచ్చారు. నిర్మల్ జిల్లాకేంద్రం నుంచి జోరిగే మౌనిక కుటుంబ సభ్యులతో వచ్చి శవాన్ని గుర్తుపెట్టారు. నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మండలం చేపూర్‌కు చెందిన జోరిగే గంగాధర్(35) నిర్మల్ జిల్లాకేంద్రంలో ఫుట్‌వేర్ షాపు నిర్వహిస్తున్నాడు. షాపు సరిగా నడవక అప్పులు పెరిగిపోయాయి. ఈ క్రమంలో ఇంట్లో చెప్పకుండా ఈనెల 8న బైక్‌పై వెళ్లిపోయాడు. 10న సోన్ బ్రిడ్జి వద్ద గోదావరిలో దూకినట్లు తెలుస్తోంది. వరద ఉధృతికి కొట్టుకొచ్చిన శవం కొత్తదాంరాజుపల్లి వద్ద ఒడ్డుకు చేరింది. మౌనిక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బాలికపై అత్యాచారయత్నం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని ఓ ప్రాంతానికి చెందిన బాలికపై అత్యాచారానికి యత్నించిన బూసెల్లి నగేశ్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై మల్లేశ్ తెలిపారు. గ్రామానికి చెందిన బాలిక టెన్త్ క్లాస్ చదువుతోంది. ఇటీవల ఇంట్లో ఎవరూ లేని సమయంలో సమీప బంధువైన నగేశ్ ఇంట్లోకి చొరబడి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. చైల్డ్‌లైన్ అధికారుల ద్వారా బాలిక పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

కుంగుబాటు.. లొంగుబాటు!

- నాడు జనశక్తి.. నేడు మావోయిస్టులు
- 2002లోనే 46 మంది సాయుధ జనశక్తి నక్సలైట్ల సరెండర్
- అప్పటి సీఎంకు ఆయుధాలు అప్పగింత
- నేడు మహారాష్ట్రలో పునరావృతం.. 61 మంది అస్త్రసన్యాసం


సాయుధ నక్సలైట్లు (ఫైల్)


హైదరాబాద్‌లో 2002 ఏప్రిల్ 28న అప్పటి సీఎం చంద్రబాబు ముందు లొంగిపోయిన 46 మంది సాయుధ జనశక్తి నక్సలైట్లు, ఆయుధాలు(ఫైల్)

సిరిసిల్ల: ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రెండున్నర దశాబ్దాల కిందట సీపీఐ(ఎంఎల్) మావోయిస్టు, జనశక్తి నక్సలైట్ల ఉద్యమాలు బలంగా ఉండేవి. కరీంనగర్ జిల్లాను తూర్పు, పశ్చిమ డివిజన్లుగా విభజించి నక్సలైట్ల కార్యకలాపాలు సాగేవి. ఇప్పటి పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాలు తూర్పు డివిజన్ పరిధిలో ఉండగా.. రాజన్నసిరిసిల్ల, జగిత్యాల జిల్లాలు పశ్చిమ డివిజన్ పరిధిలో ఉన్నాయి. తూర్పు డివిజన్‌లో మావోయిస్టు(అప్పటి పీపుల్స్‌వార్)లకు పట్టుండగా.. పశ్చిమ డివిజన్‌లో మావోయిస్టుల తోపాటు జనశక్తి నక్సలైట్లు సమాంతర ప్రభుత్వాన్ని నడిపారు. తాజాగా మావోయిస్టు పార్టీకి చెందిన పొలిట్‌బ్యూరో సభ్యుడు, మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ అభయ్ అలియాస్ సోను అలియాస్ భూపతితో సహా 60 మంది సాయుధ నక్సలైట్లు, మహారాష్ట్ర సీఎం దేవేందర్ ఫడ్నవీస్ ఎదుట బుధవారం లొంగిపోయారు. మావోయి స్టు ఉద్యమ చరిత్రలో కేంద్ర కమిటీ సభ్యుడి స్థా యి నాయకుడితోపాటు ఇంత పెద్ద మొత్తంలో మావోయిస్టులు ఆయుధాలతో లొంగిపోవడం ఓ మైలురాయి.

23 ఏళ్ల కిందట జనశక్తి

తాజా పరిణామాల నేపథ్యంలో 23 ఏళ్ల కిందటి సీపీఐ(ఎంఎల్) జనశక్తి సాయుధ నక్సలైట్లు 46 మంది లొంగుబాటు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. అప్పటి జనశక్తి పార్టీ కరీంనగర్ జిల్లా కమిటీ కార్యదర్శి రణధీర్ అలియాస్ సుంకెట సాయిలు ఆధ్వర్యంలో జనశక్తి జిల్లా కమిటీ సభ్యులు ముకేశ్, జగన్, గుట్టన్న, మహేశ్, రవీందర్‌రెడ్డిలతోపాటు మొత్తం 46 మంది సాయుధులు లొంగిపోయారు. ఇప్పుడు గడ్చిరోలీ జిల్లా తరహాలోనే అప్పట్లో రాజన్న సిరిసిల్ల జిల్లా చందుర్తి మండలం లింగంపేట–రుద్రంగి మధ్య అటవీ ప్రాంతంలో ప్రైవేటు సర్వీసు బస్‌లో 46 మంది సాయుధ నక్సలైట్లు హైదరాబాద్ వెళ్లారు. మధ్యలో ఆ బస్‌లో పోలీసులు ఎక్కారు. రెండు రోజులపాటు హైదరాబాద్ శివారులోని ఓ రిసార్ట్‌లో బసచేసిన నక్సలైట్లు అప్పటి సీఎం చంద్రబాబు సమక్షంలో లొంగిపోయారు. అప్పటి డీజీపీ పేర్వారం రాములు, అప్పటి ఎస్పీ ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్(ప్రస్తుతం బీఆర్‌ఎస్ నాయకుడు), ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డిలు జనశక్తి నక్సలైట్ల లొంగుబాటులో కీలకపాత్ర పోషించారు. ఆ తర్వాత కొద్ది రోజులకే జనశక్తి పార్టీని వేములవాడ మూలవాగులో నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు. ఆ టైంలో మిగిలి ఉన్న కొద్దిమంది యాక్టివ్ సభ్యులు కూడా లొంగిపోయారు. తర్వాతి క్రమంలో ఆ పార్టీ కనుమరుగైంది.

లొంగుబాటుకు ముందు..

జనశక్తి నక్సలైట్ల లొంగుబాటుకు ముందు 2001 అక్టోబర్ 26న బోయినపల్లి మండలం కోరెంలో సొంతూరిలో దసరా వేడుకలకు వచ్చిన అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి చెన్నమనేని విద్యాసాగర్‌రావు బావమరిది క్లాస్–1 కాంట్రాక్టర్ మార్తండరావును జనశక్తినేత రణధీర్ కిడ్నాప్ చేశారు. రాయబేరాల తరువాత వారం రోజులకు విడుదల చేశారు. ఈ క్రమంలో పోలీసు ఉన్నతాధికారులు జనశక్తిపై దృష్టిసారించారు. ఈ క్రమంలో రణధీర్‌తో అప్పటి జిల్లా ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఓఎస్‌డీ మధుసూదన్‌రెడ్డి మరో ఇద్దరు పోలీసు అధికారులు నేరుగా మేడిపల్లి మండలం మోత్కురావుపేట అడవుల్లోకి వెళ్లి రహస్యంగా చర్చలు జరిపి సామూహిక లొంగుబాటుకు బాటలు వేశారు.

మూలవాగులో జనశక్తి నిమజ్జనం

అప్పటికే మూడు దశాబ్దాల ఉద్యమ చరిత్ర గల జనశక్తి సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, కామారెడ్డి, భీంగల్ ప్రాంతాల్లో బలమైన ప్రజా ఉద్యమాన్ని నడిపించేది. 1989లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా నెల్లూరు జిల్లాకు చెందిన ఎన్.వీ.కృష్ణయ్యను గెలిపించడంతో జనశక్తి కీలకంగా ఉంది. వేములవాడకు చెందిన కూర రాజన్న అలియాస్ రాజేందర్ నాయకత్వంలో ఉద్యమం బలపడింది. 46 మంది సాయుధ నక్సలైట్ల లొంగుబాటులో ఆ పార్టీ బలహీనపడింది. ఈ నేపథ్యంలో అప్పటి ఎస్పీ ప్రవీణ్‌కుమార్ వేములవాడ మూలవాగులో మాజీ నక్సలైట్లతో జనశక్తి పార్టీని నిమజ్జనం చేశారు. జనశక్తి మిలిటెంట్లపై కేసులు ఎత్తివేస్తున్నామని, ఇకపై అసాంఘిక కార్యక్రమాలు మానివేయాలని కోరుతూ మూలవాగులో పోలీస్ రికార్డుషీట్లను దహనం చేశారు. అంతకు ముందు వేములవాడ ఆర్యవైశ్యభవన్‌లో జనశక్తి పార్టీ శ్రేణులతో ఎస్పీ సమావేశం నిర్వహించి నిమజ్జన లక్ష్యాలను వివరించారు.

పునర్‌నిర్మాణంలో ఆటుపోట్లు

పోలీసులు చేపట్టిన వేములవాడ నిమజ్జనాన్ని జనశక్తి నాయకత్వం సవాల్‌గా తీసుకుంది. ఉద్యమాన్ని నిర్మించే ప్రయత్నం చేసింది. అప్పటికే 46 మందితో లొంగిపోయిన గుట్టన్న దళనేతగా మరో రెండు దళాలను ఏర్పాటు చేశారు. ఇందులో కిరణ్, సంజీవ్ దళాలు సిరిసిల్ల, జగిత్యాల ప్రాంతంలో పనిచేస్తూ కొత్తగా పార్టీ కేడర్‌ను రిక్రూట్‌మెంట్ చేసే ప్రయత్నం చేశారు. కోనరావుపేట మండలం వట్టిమల్ల వద్ద ఇద్దరు పోలీస్ కానిస్టేబుళ్లను గుట్టన్న దళం కాల్చిచంపగా.. ప్రతిగా మరుసటి రోజే పోలీసులు చందుర్తి మండలం ననుగుల వద్ద ఇద్దరిని ఎన్‌కౌంటర్ చేశారు. గుట్టన్న సిరిసిల్ల పట్టణంలోని పద్మనాయక కల్యాణ మండపం వద్ద ఎన్‌కౌంటర్ అయ్యాడు. 2004లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం నక్సలైట్లతో చర్చలు జరపగా.. మావోయిస్టు నాయకులతోపాటు జనశక్తి పక్షాన అప్పటి రాష్ట్ర కార్యదర్శి అమర్ అలియాస్ కూర దేవేందర్, రాష్ట్ర కమిటీ సభ్యుడు రియాజ్ అలియాస్ వెంకటేశ్ పాల్గొన్నారు. చర్చల అనంతరం 2005 జూన్ 30న ముస్తాబాద్ మండలం బదనకల్ వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో రియాజ్‌తోపాటు మరో నలుగురు మరణించారు. జనశక్తి అగ్రనేత కూర రాజన్నను ఉత్తర ప్రదేశ్‌లోని బారాబంకీ జిల్లాలో, మరో అగ్రనేత అమర్ అలియాస్ దేవేందర్‌ను మహారాష్ట్రలోని పుణేలో పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నేపథ్యంలో లొంగుబాట్లు, పోలీసు నిర్బంధంతో జనశక్తి సాయుధ దళాలు కనుమరుగయ్యాయి.

తల్లిదండ్రుల మృతి.. అనాథగా బాలుడు


స్వాద్విన్ కుమార్

చొప్పదండి: ఇటీవల గుండెపోటుతో తండ్రి మృతిచెందగా అనాథగా మారిన బాలుడి ఉదంతమిది. మూడేళ్ల క్రితమే ఊపిరితిత్తుల వ్యాధితో తల్లి మృతి చెందగా, దిక్కుతోచని స్థితిలో బంధువుల వద్ద కాలం వెల్లదీస్తున్నాడు. మండలంలోని రాగంపేట గ్రామానికి చెందిన దీకొండ అశోక్ గత ఆదివారం మృతిచెందాడు. అశోక్ భార్య కూడా మూడేళ్ల క్రితమే మృతి చెందింది. అంతేకాదు అతడి తల్లి కూడా ఏడాది క్రితం మూత్ర పిండాల వ్యాధితో చనిపోయింది. దీంతో అశోక్ కుమారుడు స్వాద్విన్ కుమార్ అనాథగా మారాడు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న స్వాద్విన్ ప్రస్తుతం మేనత్తల సంరక్షణలో ఉంటున్నాడు. ఎవరూ లేరని తెలిసి రోదిస్తున్నాడు. ప్రభుత్వం, అధికారులు, దాతలు స్పందించి విద్యార్థిని ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నృసింహుడి హుండీ ఆదాయం రూ.46.84 లక్షలు



ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి వారికి హుండీల ద్వారా లభించిన ఆదాయాన్ని బుధవారం ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. 112 రోజులకు గాను రూ.46,84,046 సమకూరినట్లు ఈవో శ్రీనివాస్ తెలిపారు. 27 గ్రాముల మిశ్రమ బంగారం, 4.700 కిలోల వెండి, 26 విదేశీనోట్లు వచ్చినట్లు పేర్కొన్నారు. దేవాదాయ శాఖ జిల్లా పరిశీలకులు రాజమౌళి, ఆలయ చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, స్వచ్ఛంద సేవకులు పాల్గొన్నారు.

నా కొద్దు.. హెడ్మాస్టర్ నౌకరీ

- పదోన్నతి రద్దు చేసుకున్న ఉపాధ్యాయుడు

కరీంనగర్‌రూరల్: పదోన్నతి రావాలని ఉద్యోగులందరు కోరుకోవడం సహజం. కానీ, ఈ ఉపాధ్యాయుడు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం అధికారులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. పదోన్నతిపై గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా వచ్చిన ఈ ఉపాధ్యాయుడు పాఠశాలలోని పరిస్థితులను తట్టుకోలేక ప్రమోషన్ రద్దు చేసుకుని పాత పాఠశాలలోనే యథావిధిగా ఉపాధ్యాయుడిగా పోస్టింగ్ పొందడం చర్చనీయాంశంగా మారింది. వివరాలు.. కరీంనగర్‌లోని సవరన్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎ.రఘురాంరావు నెల క్రితం పదోన్నతిపై దుర్శేడ్ జెడ్పీ పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా బదిలీపై వచ్చారు. కొన్నిరోజులుగా పాఠశాలలో నెలకొన్న పరిస్థితులు, ఒక స్కూల్ అసిస్టెంట్ వ్యవహరిస్తున్న తీరుతో మానసికంగా ఆందోళనకు గురయ్యారు. విధులు సక్రమంగా నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. చివరకు కుటుంబ సభ్యుల ఒత్తిడితో పదోన్నతి రద్దు చేయాలని ఈ నెల 13న స్కూల్ ఎడ్యుకేషన్ వరంగల్ ఆర్జేడీకి దరఖాస్తు చేసుకున్నారు. ఆర్జేడీ ఉత్తర్వుల మేరకు జిల్లా విద్యాధికారి శ్రీరాంమొండయ్య మంగళవారం రఘురాంరావు పదోన్నతిని రద్దు చేసి తిరిగి స్కూల్ అసిస్టెంట్‌గా సవరన్ ప్రభుత్వ పాఠశాలలో చేరాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే దుర్శేడ్ స్కూల్‌లో ఒక స్కూల్ అసిస్టెంట్ వ్యవహరిస్తున్న తీరుతోనే రఘురాంరావు వెళ్లిపోయినట్లు ఉపాధ్యాయుల ద్వారా తెలిసింది. గతేడాది పాఠశాలలోని పరిస్థితులను తట్టుకోలేక అప్పటి హెచ్‌ఎం పరబ్రహ్మమూర్తి గుండెపోటుతో మృతిచెందడం ఉపాధ్యాయులను కలవరపరిచింది. ప్రస్తుతం మరో ప్రధానోపాధ్యాయుడు పదోన్నతి రద్దు చేసుకోవడం వివాదాస్పదంగా మారింది. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖాధికారులు దుర్శేడ్ పాఠశాలలో నెలకొన్న అసాధారణ పరిస్థితులపై సమగ్ర విచారణ జరిపించి, బాధ్యులపై చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

వస్త్ర దుకాణంలో అగ్నిప్రమాదం

- మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది
- సుమారు రూ.40 లక్షల నష్టం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లా కేంద్రంలోని మోచీబజార్‌లోని వేదిక షాపింగ్‌మాల్‌లో షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి సుమారు రూ.40 లక్షల మేరకు ఆస్తినష్టం వాటిల్లింది. షాపింగ్‌మాల్ నిర్వాహకులు మంగళవారం రాత్రి తాళం వేసి వెళ్లారు. మాల్ నుంచి పొగలు రావడంతో స్థానికులు అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. వారు సకాలంలో చేరుకుని మంటలను ఆర్పివేశారు. ఇరువైపులా మంటలు వ్యాపించకుండా కట్టడి చేశారు. ప్రమాదంలో సుమారు రూ.40 లక్షల విలువైన వస్త్రాలు కాలిపోయినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రమాదానికి షార్ట్‌సర్క్యూట్ కారణమని నిర్వాహకులు ఫిర్యాదు చేశారు.

తల్లి, తమ్ముళ్లపై దాడి కేసులో మూడేళ్ల జైలు

ధర్మపురి/జగిత్యాలజోన్: కన్న తల్లి, తమ్ముళ్లపై దాడి చేసిన కేసులో నిందితుడికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ ధర్మపురి జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ ఏగి జానకీ బుధవారం తీర్పు చెప్పారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్ కథనం ప్రకారం.. ధర్మపురి మండలం దొంతాపూర్‌కు చెందిన ఎర్ర కళావతికి ముగ్గురు కుమారులు, ఆమె భర్త మరణించాక పెద్ద కుమారుడు అక్షయ్‌కుమార్ డబ్బుల విషయమై తల్లి, తమ్ముళ్లతో గొడవపడుతుండేవాడు. 20202 అక్టోబర్ 4న తల్లి, తమ్ముళ్లు సంజయ్, ఉదయ్‌కుమార్‌ను దుర్భషలాడుతూ.. వారిపై దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సైలు శ్రీకాంత్, కిరణ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అరెస్ట్ చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కోర్టు మానిటరింగ్ అధికారులు శ్రీకాంత్, మహేశ్ సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టడంతో పరిశీలించిన జడ్జి అక్షయ్‌కుమార్‌కు మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు.

తెరవెనుక డాక్టర్ అనస్థీషియా

- వైద్యరంగంలో వారిసేవలు అద్భుతం
- పేషెంట్‌కు నొప్పి తెలియకుండా సర్జరీలు
- ఉమ్మడి జిల్లాలో ప్రతీనెల వేలాది ఆపరేషన్లు
- నేడు ప్రపంచ అనస్థీషియా దినోత్సవం



కోల్‌సిటీ(రామగుండం): పేషెంట్‌కు నొప్పి తెలియకుండా ఆపరేషన్ చేయడం వైద్యశాస్త్రంలో ఓ అద్భుతం. శరీరంలోని ప్రతీ అవయవానికి చేసే సర్జరీకి ముందుగా మత్తుమందు(అనస్థీషియా)ఇస్తారు. దీంతో నొప్పి బావన ఉండదు. క్లిష్టమైన, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడేందుకు అనస్థీషియా నిపుణులు చేస్తున్న సేవలు అత్యంత ముఖ్యమైనవి. తెరవెనుక డాక్టర్ అనస్థీషియా. వీరికోసం ఏటా అక్టోబర్ 16న ప్రపంచ అనస్థీషియా దినోత్సవం నిర్వహిస్తున్నారు. 1846 అక్టోబర్ 16న తొలిసారి విలియం టీజీ మోర్టన్ అనే వైద్యుడు ఈథర్ అనస్థీషియాను విజయవంతంగా ప్రదర్శించారు.

మత్తుమందు లేని రోజుల్లో..

అనస్థీషియా అమలులోకి రానిరోజుల్లో పేషెంట్‌కు శస్త్రచికిత్స చేయాలంటే, మత్తు రావడానికి తలపై గట్టిగా కొట్టడం, పాములతో కరిపించడం, వివిధ రకాల మత్తు పదార్థాలు తినిపించడం, గట్టిగా చేతులతో పట్టుకుని ఆపరేషన్లు చేసేవారని చెబుతున్నారు. అనస్థీషియాను కనిపెట్టాక చిన్న సూదితో శరీరంలో మత్తు ఎక్కించేసి పేషెంట్‌కు నొప్పి తెలియకుండా ఆపరేషన్ చేస్తున్నారు.

జీజీహెచ్‌లో 13 మంది అనస్థీషియాలు..

కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో అనస్థీషియాల సహకారంతో ప్రతీనెల వేలాది ఆపరేషన్లు జరుగుతున్నాయి. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలోని ప్రభుత్వ సిమ్స్ అనుబంధ జీజీహెచ్‌లో అనస్థీషియా విభాగం ప్రత్యేకంగా ఉంది. ఇందులోని ఇద్దరు ప్రొఫెసర్లు, 10 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఒక ఎస్ఆర్ సేవలు అందిస్తున్నారు.

పేషెంట్ కోలుకునే వరకు..

పేషెంట్‌కు మత్తుమందు ఇచ్చేది అనస్థీషియాలే అయినా.. శస్త్రచికిత్స పూర్తయి, కోలుకునే వరకూ దగ్గరుండి పర్యవేక్షిస్తారు. పేషెంట్ త్వరగా కోలుకున్నాడంటే అందులో అనస్థీషియా పాత్రకీలకంగా ఉంటుంది.

వైద్యరంగంలో కీలకం



వైద్యరంగంలో అనస్థీషియా చాలా కీలకమైనది. ప్రస్తుత వైద్య విధానంలో మత్తుమందు లేకపోతే అనే ఊహనే కష్టంగా ఉంటుంది. మత్తుమందు అందుబాటులోకి రావడంతో విప్లవాత్మక మార్పులు చోటుచేసుకున్నాయి.

– దండె రాజు, ఆర్ఎంవో, జీజీహెచ్

తెరవెనుక వైద్యుడు



తెరవెనుక వైద్యుడు అనస్థీషియా. ఆపరేషన్ చేయడానికి సర్జన్‌తోపాటు అనస్థీషియా కూడా కీలకమే. పేషెంట్ కోలుకునే వరకు పర్యవేక్షిస్తుంటాడు. జీజీహెచ్‌లో చాలా హైరిస్క్ కేసులు కూడా అనెస్థీషియాల సహకారంతో విజయవంతంగా చేస్తున్నాం.

– అరుణ, గైనిక్ హెచ్‌వోడీ, జీజీహెచ్

ఇంటర్వెన్షనల్ రేడియాలజీతో సర్జరీలకు స్వస్తి


మాట్లాడుతున్న డాక్టర్ హరీశ్

కరీంనగర్: శస్త్రచికిత్స లేకుండా, నొప్పి తెలియకుండా, వేగవంతమైన రికవరీతో వైద్యం అందించే ఇంటర్వెన్షనల్ రేడియాలజీ అందుబాటులోకి వచ్చాక శస్త్రచికిత్సలకు స్వస్తి పలికినట్లేనని సోమాజిగూడ యశోద హాస్పిటల్ ఇంటర్వెన్షనల్ న్యూరో రేడియాలజిస్ట్ డాక్టర్ హరీశ్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లోని యశోద హెల్త్ సెంటర్‌లో మాట్లాడారు. ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సర్జరీలకు సరైన ప్రత్యామ్నాయమన్నారు. బ్రెయిన్ స్ట్రోక్, క్లోటింగ్, బ్లీడింగ్, క్యాన్సర్లు, యుటరైన్ బ్లీడింగ్ తదితర రోగాల చికిత్సకు ఇది ఎంతో ఉపయోగపడుతోందని వివరించారు. కొన్నిసార్లు డెలివరీ తర్వాత అధిక రక్తస్రావం వల్ల గర్భాశయాన్ని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అయితే సాంకేతికత ద్వారా రక్తస్రావం జరుగుతున్న కచ్చితమైన స్థానాన్ని గుర్తించి, ఆ రక్తనాళాన్ని మూసేయడం సాధ్యమవుతుందన్నారు. బ్లాక్ అయిన నాళాలను తెరవడం, లీకైన నాళాలను మూసేయడం, మెదడులో రక్తపుగడ్డలను తొలగించడం వంటి సంక్లిష్ట చికిత్సను ఇంటర్వెన్షనల్ రేడియాలజీ సులభంగా చేస్తోందని తెలిపారు.

'క్రిప్టో' దందాపై పోలీసుల నిఘా

- జిల్లానుంచి పరారైన నిందితులు
- వారి కోసం గాలిస్తున్న పోలీసులు
- పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు



మెటాఫండ్‌ప్రో నిర్వాహకులను అరెస్ట్ చూపుతున్న ఎస్పీ (ఫైల్)

జగిత్యాలక్రైం: జగిత్యాల జిల్లాలో రెండేళ్లుగా మెటాఫండ్ ప్రో, పలు కంపెనీల పేరుతో ఆన్‌లైన్‌లో పెట్టుబడి పెడితే అధిక వడ్డీ వస్తుందని నమ్మించి మోసం చేసిన యాప్ నిర్వాహకులపై పోలీసు శాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే జిల్లాకు చెందిన ఐదుగురిని అరెస్ట్ చేయడంతోపాటు, మరికొంత మందిని విచారణ చేపడుతున్నారు. మెటా ఫండ్ పేరుతో మోసం చేసిన వ్యక్తులపై మొదట కొడిమ్యాల పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. జగిత్యాల పట్టణానికి చెందిన మరో వ్యక్తి సుమారు రూ.80.50 లక్షలు మోసం చేశారని ఫిర్యాదు చేయడంతో జగిత్యాలకు చెందిన ఓ వ్యక్తి.. హైదరాబాద్‌కు చెందిన మరో వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు.

విచారణలో వెల్లడవుతున్న పేర్లు

అరెస్ట్ అయిన వారితో పోలీసులు లోతైన విచారణ చేయడంతో చైన్ సిస్టమ్ దందా చేపట్టిన వారి రహస్యాలు బయటపడుతున్నాయి. అరెస్టయిన వారిలో ఓ వ్యక్తి ఆన్‌లైన్ పెట్టుబడుల్లో ప్రధాన పాత్ర పోషించిన సుమారు 12 మంది పేర్లు వెల్లడించినట్లు సమాచారం. వీరంతా వందలాది మందితో సుమారు రూ.500 నుంచి రూ.800కోట్లు పెట్టుబడి పెట్టించారు. యాప్ మూసినప్పటి నుంచి తమ డబ్బులు చెల్లించాలని పెట్టుబడి పెట్టిన వారు ఒత్తిడి పెంచడంతో వారికి బాండ్ పేపర్లు, చెక్కులు ఇచ్చారు. గడువు ముగిసినా డబ్బులు చెల్లించకపోవడంతో కొంత మంది పోలీసులను ఆశ్రయించడంతో పోలీసులు కేసు నమోదు చేసి చర్యలు చేపడుతున్నారు.

ఫిర్యాదు చేసేందుకు జంకుతున్న బాధితులు

జిల్లాకు చెందిన కొంతమంది ప్రభుత్వ ఉద్యోగులు తమ పేరిట, బినామీల పేరిట ఆన్‌లైన్ క్రిప్టో దందాలో కోట్లాది రూపాయల పెట్టుబడి పెట్టారు. ప్రస్తుతం వారు మోసపోయామని తెలుసుకున్నా.. ఫిర్యాదు చేసేందుకు మాత్రం జంకుతున్నారు. ఫిర్యాదు చేస్తే డబ్బు ఎక్కడి నుంచి వచ్చిందని విచారణ చేపడతారని భయాందోళన చెందుతున్నారు. మోసపోయిన వారిలో ఒకరిద్దరు పోలీసు అధికారులు కూడా ఉన్నట్లు సమాచారం. వారు కూడా ఫిర్యాదు చేసేందుకు సుముఖత వ్యక్తం చేయడం లేదు.

పెరుగుతున్న రాజకీయ ఒత్తిళ్లు

జిల్లాలో వేలాది మంది బాధితులు ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోవడంతో అసలైన యాప్ నిర్వాహకులను గుర్తించి బాధితులను ఆదుకోవాలని రాజకీయ ఒత్తిళ్లు తీవ్రమవుతున్నాయి. ఇప్పటికే మాజీమంత్రి జీవన్ రెడ్డి ముఖ్యమంత్రికి లేఖ రాశారు. దీనిపై పూర్తివిచారణ చేపట్టాలని రాష్ట్ర పోలీసు అధికారులకు విన్నవించారు. అసలు నిందితులను గుర్తించి వారి ఆస్తులను జప్తు చేసి బాధితులకు డబ్బు అందేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ఫిర్యాదు చేస్తే చర్యలు చేపడతాం



ఆన్‌లైన్ పెట్టుబడులు పెట్టి మోసానికి గురైన బాధితులు ఫిర్యాదు చేస్తే నిందితులపై చర్యలు చేపడతాం. జగిత్యాలలో ఇద్దరి నుంచి ఫిర్యాదులు రావడంతో ఐదుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాం. ఆన్‌లైన్ పెట్టుబడులపై లోతైన విచారణ చేపడుతున్నాం. మోసం చేసిన వారు ఎవరైనా చర్యలు తప్పవు.

– రఘుచందర్, డీఎస్పీ, జగిత్యాల